క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి

దేవరకొండ : మండల పరిధిలోని కొండభీమనపల్లి గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆగ్రామానికి చెందిన తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర ఆంజనేయులు శనివారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త బస్టాప్ పక్కన ఉన్న వాటర్ సంపు పునర్నిర్మాణం చేపట్టాలని అంతేగాకుండా గ్రామంలోని బీసీ కాలనీలో నెలకొన్న మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని ఆయన వినతిపత్రంలో కోరారు.

బాధితుడికి నిత్యావసర సరుకులు అందజేత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న హన్యానాయక్

మిర్యాలగూడ టౌన్ : పట్టణానికి చెందిన కోటయ్య కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. శనివారం విశ్వాస పరిచర్య ప్రార్థన మందిరం పాస్టర్ ధీరావత్ హన్యానాయక్ కోటయ్యకు నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా కోటయ్య మంచిగా కోలుకొని త్వరగా నడవాలని ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమాబాయి, సుధారాణి, చిలకమ్మ, రమేష్ తదితరులున్నారు.

తీన్మార్ మల్లన్న గెలుపొందడం హర్షణీయం



కేక్ కట్ చేస్తున్న ఏకే ఫౌండేషన్ చైర్మన్ అనిల్‌కుమార్ యాదవ్

మిర్యాలగూడ టౌన్ : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపొందడంతో శనివారం స్థానిక బీసీ సంఘం భవనంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. అనంతరం కేక్‌ను ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్‌కుమార్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ గౌడ్‌లు కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీకాంత్, సురేష్, వినోద్, శరత్, మహేష్ తదితరులున్నారు.

క్రీడల్లో నల్లగొండకు గుర్తింపు తేవాలి

నల్లగొండ రూరల్ : క్రీడాకారులు క్రీడల్లో రాణించి నల్లగొండ జిల్లాకు గుర్తింపు తేవాలని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండారు ప్రసాద్ అన్నారు. శనివారం ఎన్‌జీ కాలేజీలో కేకేఆర్ ఫుట్‌బాల్ అకాడమీ, నీలగిరి ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడల్లో పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగితే ఉన్నత లక్ష్యానికి చేరుతారని సూచించారు. అనంతరం క్రీడాకారులకు స్పోర్ట్ టీషర్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో కంది కట్ల దాసు, అరవింద్, సునిత, ప్రశాంత్, హుసూన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో..జర మేల్కో !



దేవరకొండ వెళ్లే మార్గంలో రోడ్డుపై ఉన్న స్టే వైర్

డిండి: మండల కేంద్రం నుంచి దేవరకొండ వెళ్లే రోడ్డు మార్గంలో డిండి విత్తనోత్పత్తి కేంద్రం సమీపంలో కరెంట్ స్తంబాల స్టే వైర్లు రహదారిపై ఉన్నాయి. దీంతో ఆ మార్గం గుండా ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి స్టే వైర్లను మార్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత

నకిరేకల్ : వైద్య ఖర్చుల నిమిత్తం పేద కుటుంబానికి శనివారం నకిరేకల్‌లోని లిటిల్ సోల్జర్ ఫౌండేషన్ ప్రతినిధులు ఆర్థికసాయం అందజేశారు. వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన బొమ్మగాని నరేష్ గౌడ్ –మానస దంపతులకు ఏడవ నెలలోనే ఇద్దరు కవలలు జన్మించారు. పుట్టిన ఇద్దరు పిల్లలు కేవలం 850 గ్రాముల బరువు ఉన్నారు. వారికి ఊపిరితిత్తుల ,గుండె తదితర సమస్యలు రావడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న నకిరేకల్ లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు కర్నాటి నరేష్, కాసర్ల సురేష్, మందుల శేఖర్ అక్కడికి వెళ్లి ఆ కుటుంబానికి రూ.20,200 సహాయం అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

• మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ : దామరచర్లలో నిర్వహించిన బడిబాటలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, తదితరులు

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమై విద్యను అందుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని బాలికల, బకల్‌వాడీ ఉన్నత పాఠశాలతోపాటు దామరచర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. అలాగే మిర్యాలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కరపత్రం, వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలకు తమ పిల్లలను పంపించి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా తల్లిదండ్రులు ఆలోచించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని లేనట్లయితే చర్యలు తప్పవన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తాను ప్రకటించిన విధంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 29 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ఆయాలకు తన జీతం నుంచి వేతనంగా అందిస్తానన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను సన్మానించి బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. కాగా బాలికల ఉన్నత పాఠశాలలో వర్షం కారణంగా బురద ఏర్పడి గుంటగా ఏర్పడడంతో ఎమ్మెల్యే తన సొంత నిధులతో మట్టిని పోయించి చదును చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.ధర్మానాయక్, ఏఎంసీ చైర్మన్ భవాని, నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, రవినాయక్, నందినిరవితేజ, కొర్ర నాగునాయక్, కొర్ర కృష్ణకాంత్‌నాయక్, డాక్టర్‌లు విజయేవందర్, ఝాన్సీలక్ష్మీబాయి, పాండు నాయక్, ఉపాధ్యాయులు పరుశురాములు, నర్సిరెడ్డి, గోపికృష్ణ, ఉపేందర్, అనిత, జ్యోతి, సంతోష్, అశ్విని, ప్రవీణ్, సబీహా, సుల్తానా, లత, శారదాబాయి, జనార్దన్‌రెడ్డి, పేరయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని



పెద్దవూర : బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఏటీడీఓ లక్ష్మారెడ్డి

పెద్దవూర: విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహాయ గిరిజన అభివృద్ధి అధికారి (ఏటీడీఓ) కడారు లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 3 నుంచి పదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎస్టీ హాస్టల్‌లలో సీటు కావాల్సిన విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి కొల్లు బాలకృష్ణ, ఉపాధ్యాయులు కూన్‌రెడ్డి రాంరెడ్డి, డి.సైదులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలి

దేవరకొండ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని దేవరకొండ ఎంఈఓ మాతృనాయక్ అన్నారు. జిల్లా కేంద్రం నుండి స్థానిక ఎమ్మార్సీకి చేరుకున్న పాఠ్య పుస్తకాలను శనివారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆయన అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,

హాలియా : ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందని అనుముల మండల ఎంఈఓ లావూరి బాలునాయక్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం హాలియా పట్టణంలోని వడ్డెరకాలనీ, హాలియా పట్టణంలో నిర్వహించిన బడిబాట ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రుడునాయక్, బూరుగు రామమూర్తి, వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు లోక్యానాథ్, వెంకటేశ్వర్లు, మధుసూధన్, వెంకటేశ్వరావు, రాములు, లక్ష్మయ్య, గంగాధరాచారి రజిత, సౌజన్య, చంద్రయ్య పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని చెన్నంనేనిపల్లి, పెండ్లిపాకల, చింతకుంట్లతో పాటు పలు గ్రామాల్లో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో బడిబాటపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చెరుపల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు కొర్ర లోక్యనాయక్, చంద్రయ్య, సీతారాం, నల్ల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : విద్యార్థులను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఎన్ఓ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని యల్లాపురంతండాలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నోవ, మధు, శశిధర్‌రెడ్డి, పార్వతమ్మ, సునిత, భాను పాల్గొన్నారు.



హాలియా : బడిబాట ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంఈఓ బాలునాయక్



కొండమల్లేపల్లి : బడిబాట కరపత్రం ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు



తిరుమలగిరి : యల్లాపురంతండాలో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

లోక్‌అదాలత్‌లో దీర్ఘకాలిక కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా ఐదో అదనపు న్యాయమూర్తి జి. వేణు

మిర్యాలగూడ టౌన్ : దీర్ఘకాలిక కేసులు లోక్ అదాలత్‌లో సత్వర పరిష్కారమవుతాయని జిల్లా ఐదో అదనపు న్యాయమూర్తి జి. వేణు అన్నారు. శనివారం మిర్యాలగూడ కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి బి. సుజయ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.స్వర్ణలత, రెండో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. అపూర్వ రవళి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పైసా ఖర్చు లేకుండా లోక్‌అదాలత్‌లో సత్వర న్యాయం జరుగుతుందన్నారు. అందరికీ సమానంగా, సత్వర న్యాయం అందించడమే న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. లోక్‌అదాలత్‌లో ఇచ్చిన తీర్పే అంతిమ తీర్పు అన్నారు. మిర్యాలగూడ కోర్టులోని ఐదు కోర్టుల ద్వారా 701 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సకినాల వేలాద్రి, మండల న్యాయ సేవా సంస్థ సభ్యులు ఎస్ఆర్‌కె ప్రభాకర్, కొంక వెంకన్న, కె. రామకృష్ణ, ఎం. మల్లేష్, అనంతుల గంగా భవానీ, కె. శ్రీనివాస్, ఎం. కుమార్‌రెడ్డి, ధనావత్ రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాదులు సుధాకర్, దీపారాణి, లింగంపల్లి శ్రీనివాస్‌లతో పాటు లింగంపల్లి అంజయ్య, గోదాల వెంకట్‌రెడ్డి, జూనియర్, సీనియర్ న్యాయవాదులు, పోలీస్‌శాఖ తదితరులున్నారు.

లోక్‌అదాలత్‌లో 382 కేసుల పరిష్కారం

నిడమనూరు : స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌కార్యక్రమంలో 382 కేసులు జడ్జి టి. స్వప్న పరిష్కరించారు. 172 కేసులను రాజీ చేయడం, ఫైన్ వేసిన కేసులు, 78 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, 132సాధారణ కేసులు పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీపీ సాదన, బార్ కౌన్సిల్ కార్యదర్శి వీరయ్య, న్యాయవాదులు నాగరాజు, వెంకన్న, వినోద్, బొల్ల ంఎనివాస్‌యాదవ పాదిళ్ల శ్రీను, ఏడీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి



దొంకతండాలో మృతి చెందిన రెండు గేదెలు

త్రిపురారం : విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన మండలంలోని దొంకతండా గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం దొంకతండా గ్రామానికి చెందిన ధనావత్ మంగ్యా, ధనావత్ తుల్చాలు వ్యసాయంతో పాటుగా గేదెలు సాకుతున్నారు. రోజు మాదిరిగానే గేదెలను మేత కోసం సమీపంలో ఉన్న పొలాలకు వదిలారు. గేదెలు మేత మేసుకుంటూ పక్కనే ఉన్న తుంగపాడ్ బొందం వద్దకు చేరుకున్నాయి. అక్కడే తుంగపాడు బొందానికి పొలాల అవసరాల నిమిత్తం రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ తీగలు తగిలి రెండు గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. చనిపోయిన రెండు గేదెల విలువ రూ. 1,50000 ఉంటుందని ప్రభుత్వం అదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రామోజీరావుకు నివాళి

మిర్యాలగూడ టౌన్ : ఓ ప్రముఖ దినపత్రిక అధినేత రామోజీరావు అకాల మరణంతో పలువురు సంతాపం ప్రకటించారు. శనివారం స్థానిక అమరవీరుల స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి జర్నలిస్టులు, టీడీపీ, కాంగ్రెస్, మాలమహానాడు సంఘాల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఖాజా హామీదుద్దీన్, కలిమెల నాగయ్య, మహ్మద్ అస్లాం, రంగా శ్రీనివాస్, బొంగరాల మట్టయ్య, రమేష్‌నాయక్, అవుల రమేష్, వేణు, ప్రసాద్, నాసర్, కట్టా బాబు, ఇండ్ల గణేష్, టీడీపీ నాయకులు బంటు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, గోపాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు బెజ్జం సాయి, మాలమహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్లపల్లి రవి, జయరాజు తదితరులున్నారు.



రామోజీరావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం ప్రారంభం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జగిని భీమయ్య, రేపాల మదన్‌మోహన్

నల్లగొండ టౌన్ : ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్ జగినిభీమయ్య, లయన్ రేపాల మదన్‌మోహన్ కోరారు. ఎంజేఎఫ్ లయన్స్‌క్లబ్ నల్ల గొండ, చేతన ఫౌండేషన్ కొంగర రామచందర్ రావు కుటుంబ సభ్యులు, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వారిచే నల్లగొండ పట్టణంలోని పెరుమాళ్ల హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. ఆధునిక వైద్య పరికరాలతో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అత్యంత ఖరీదైన పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నందున పేదలకు ఉపయోగంగా ఉంటుందన్నారు. ఆదివారం కూడా శిబిరాన్ని నిర్వహిస్తారని, పట్టణ, ఇతర ప్రాంతాల ప్రజలు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో 200 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నేతి రఘుపతి, కొంగర రాంచందర్ రావు, రంగారావు, అలీమొద్దిన్, ఎల్‌వీకుమార్, లయన్ కేవి ప్రసాద్, గట్టుపల్లి అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, డాక్టర్‌పుల్లారావు, అనితారాణి, మందడి శంకర్‌రెడ్డి, రాజశేఖర్, చండికేశ్వర్, సత్యనారాయణ, సైదులు, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయ కౌలు భూములకు రేపు వేలం

కనగల్: మండల పరిధిలోని ఎం.గౌరారం గ్రామ శివారులోని హాలియా మండలం మారెపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థాన కౌలు భూములకు సోమవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాట్ నంబర్ 1నుంచి 70వరకు గల 189-33 ఎకరాల భూమికి వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు. రైతులు గంట ముందుగా రూ.10,000చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. వివరాలకు ఆలయ అధికారి 9959198949 సంప్రదించాలని తెలిపారు.

ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి



మట్లాడుతున్న దశరథనాయక్

మిర్యాలగూడ టౌన్ : విద్యాశాఖ ఉన్నతాధికారులు విడుదల చేసిన ఉపాధ్యాయ పదోన్నతులతో జూన్ మాసంలో ఖాళీ అయ్యే పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని బంజారా ఉద్యోగులు సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 2, 3వ తేదీల్లో చాలా వరకు ఖాళీలు ఏర్పడే అవకాశం ఉన్నందున ఆ ఖాళీలను ప్రస్తుతం పదోన్నతులతో భర్తీ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు మక్లనాయక్, శంకర్‌నాయక్, శ్రీనునాయక్, హరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి : ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. నార్కట్‌పల్లి మండల పరిధిలోని అమ్మబోలు గ్రామంలో గల గంగాభవానీ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన శాంతి కల్యాణంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగపుత్రుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కాయ రాజయ్య, ఇటికల మైసయ్య, తవిడిబోయిన భాస్కర్, పర్రె వెంకటపాపయ్య, ఇటికల శ్రీరాములు, పాల్గొన్నారు.

సదస్సు ప్రచార కరపత్రాలు ఆవిష్కరణ

నకిరేకల్ : సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఉపాధి హామీ చట్ట రక్షణ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య కోరారు. నకిరేకల్‌లో శనివారం ఆ సదస్సు ప్రచార కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. పోరాటల ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కత్తుల లింగస్వామి, చింతపల్లి లూర్దు మార్య, గండమల్ల రాములు, మన్నెం భిక్షం, జోగు లక్ష్మయ్య, సాగర్ల నర్సింహ పాల్గొన్నారు.


విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని బూరుగడ్డ మాచవరంలో ఉన్న డబుల్‌బెడ్ రూం ఇళ్ల కాలనీలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని గ్రామ అంబేద్కర్ యూత్ సభ్యుడు పాదిల నాగరాజు కోరారు. గ్రామంలోని 30 డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేసి ఆరు నెలలు గడుసున్నా వీధి దీపాలు మాత్రం ఏర్పాటు చేయలేదని తెలిపారు.

అనుమతి లేని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

కొండమల్లేపల్లి : అనుమతి లేని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ కొండమల్లేపల్లి శాఖ పట్టణ కార్యదర్శి పెరికేటి ఆకాశ్ అధికారులను కోరారు. అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేపడితే చర్యలు తీసుకోవాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు.

డిప్యూటీ సీఎంను కలిసిన ఇండియన్ ఓవర్సీస్ కో ఆర్డినేటర్



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇరుగు మధు

మిర్యాలగూడ టౌన్ : పట్టణానికి చెందిన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ ఇరుగు మధు శనివారం ప్రగతి భవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ నిధుల ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని, శ్మశాన వాటికలకు ప్రహరీ నిర్మాణం, ఎస్సీ నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట ఓవర్సీస్ కాంగ్రెస్ నాయకులు రాయదాస్ మంతేనా తదితరులు ఉన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టడం సంతోషకరం



మాట్లాడుతున్న సుంకరి భిక్షం గౌడ్

నల్లగొండ : ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టడం సంతోషకరమని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ అన్నారు. శనివారం నల్లగొండలోని సంఘం భవన్‌లో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్‌సీ రెడ్డి, బత్తిని భాస్కర్‌గౌడ్, అద్దంకి సునీల్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్‌కు ఇంకా కొన్ని అనుబంధ సవరణలు కూడా చేర్చాలని కోరారు. కట్ ఆఫ్ డేట్‌ను ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించాలన్నారు. వేలమందికి ఒకే రోజు వెబ్ ఆప్షన్స్ ఇవ్వడం కష్టసాధ్యమని, మ్యానువల్ కౌన్సెలింగ్‌గా మార్చాలి కోరారు. కౌన్సెలింగ్ కంటే ముందుగానే ప్రభుత్వము ఇచ్చిన హామీ మేరకు 317 జీఓ బాధితులను వారి సొంత జిల్లాలకు తీసుకుని రావాలని ఆయన కోరారు.

మృగశిర కార్తె.. చేపలకు మస్తు గిరాకీ



పెద్దవూరలో విక్రయిస్తున్న చేపలు



నిడమనూరులో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

హాలియా : మృగ శిరకార్తె సందర్భంగా శనివారం హాలియా మున్సిపాలిటీ పట్టణంలో చేపలకు విపరీతమైన డిమాండ్ నెలకొంది. ఇదే అదునుగా భావించిన చేపల వ్యాపారులు ఒక్కసారి రేట్లను అధికం చేశారు. సాధారణంగా కిలో చేపలు రూ.150 రూపాయలకు విక్రయించేవారు. మృగశిర కార్తె కావడంతో కిలో చేపలు ధర రూ. 250పైగా పలికింది. అయిన్నప్పటికీ చేపల కోసం ప్రజలు క్యూ కట్టారు. చేపల మార్కెట్ వద్ద ప్రజలు పెద్ద సంఖ్యలో క్యూకట్టిన్నప్పటికి చేపలు దొరకక పోవడంతో ప్రజలు మాంసను కొనుగోలు చేసి సంతృప్తి చెందారు.

పెద్దవూర : మృగశిర కార్తె సందర్భంగా మండలంలో చికెన్, మాంసం, చేపల ధరలు ఒక్కసారిగా చుక్కలనంటాయి. మృగశిర కార్తె ప్రవేశం రోజున చేపలు, చికెన్, మాంసంలను తినటం ఆనవాయితీగా వస్తుంది. మృగశిర కార్తె రోజు ప్రజల నుంచి వచ్చే డిమాండ్‌ను గుర్తించి వ్యాపారులు చికెన్, చేపలు, మాంసం ధరలను రెట్టింపు చేశారు. వారం రోజుల క్రితం కిలో చికెన్ రూ.220లు ఉండగా మృగశిర కార్తె రోజు రూ.260లు పలికింది. అలాగే కిలో కొర్రమీను గ్రామీణ ప్రాంతమైన మండలంలో రూ.250లు ఉండగా రూ.450లు, రవ్వలు, బొచ్చెలు కిలో రూ.150లు ఉండగా రూ.250లు విక్రయించారు. చేపలకు ఇంత రేటు పలుకుతున్నప్పటికీ మండల ప్రజలు నాగార్జునసాగర్ హిల్‌కాలనీ, పైలాన్‌కాలనీ, దెయ్యాలగండి ప్రాంతాలకు వెళ్లి చేపలు వచ్చే వరకు నిరీక్షించి అధిక ధర చెల్లించి తెచ్చుకున్నారు. మేక మాంసం కిలో రూ.850లు పలికింది. గ్రామాలలో కిలో నాటుకోడి జీవించి ఉన్నది రూ.350లు ఉండగా అది మృగశిర కార్తె అయిన శనివారం రూ.500లు పలికింది.

నిడమనూరు : మృగశిర కార్తె ప్రారంభం కావడంతో చేపలకు గిరాకీ పెరిగింది. సంప్రదాయంగా మృగశిర కార్తెలో చేపలను తినడం ఆనవాయితీ వస్తుంది. మండల కేంద్రంలో చేపలకు మామూలు రోజుల కన్నా శనివారం ఎక్కువ ధర పలికింది.

సాయి సన్నిధిలో మంత్రి జూపల్లి పూజలు



మంత్రి జూపల్లి కృష్ణారావును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొండమల్లేపల్లి (చింతపల్లి) : చింతపల్లి మండల కేంద్రంలో శ్రీ షిర్డీ సాయినాథుడి దేవాలయ 17వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దేవాయలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, ఊరె కష్టయ్య, కుంభం పుల్లారెడ్డి, పాల్గొన్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయరూ



సూచిక బోర్డులు లేని కొండమల్లేపల్లి చౌరస్తా

కొండమల్లేపల్లి : 167వ జడ్చర్ల కోదాడ జాతీయ రహదారిపై ఉన్న కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద ఆయా ప్రాంతాలకు వెళ్లే మార్గాలు తెలియజేస్తూ ఎలాంటి సూచిక బోర్డులు లేవు. దీంతో ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. నల్లగొండ, హైదరాబాద్, సాగర్, దేవరకొండ ప్రాంతాలకు వెళ్లేందుకు కొండమల్లేపల్లి చౌరస్తా కేంద్ర బిందువుగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి చౌరస్తా వద్ద ఆయా మార్గాలలో వెళ్లే ప్రాంతాలకు సంబంధించిన పేర్లతో కూడిన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.